క్లుప్తంగా

పశువైద్యశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ, తదితరులు

రామడుగు: మండలంలోని వెదిర ప్రభుత్వ పశువైద్యశాలను సోమవారం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వై. జయరాములు తనిఖీ చేశారు. పశువులకు అందిస్తున్న వైద్యసేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు, కార్యాలయ రికార్డులు పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లా అధికారి ప్రభాకర్‌రెడ్డి, వెదిర, రామడుగు, గోపాల్‌రావుపేట పశువైద్యాధికారులు జగన్, మనోహర్, అనిల్‌రెడ్డి, గిరిధర్‌రావు, రఘునాథరావు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం చేస్తున్న పాలకవర్గం సభ్యులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మాతంగి సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య రజితకు సోమవారం ఆదర్శ పురుషుల పొదుపు సంఘం ఆధ్వర్యంలో రూ.65,588 అందించారు. సంఘం చైర్మన్ తాడ వాసుదేవరెడ్డి, ఉపాధ్యక్షుడు మామిడి శ్రీనివాస్, పాలకవర్గం సభ్యులు మామిడి వెంకటయ్య, పెద్దపల్లి రవీందర్, భాస్కర్, మ్యాదర స్వామి, కత్తుల శ్రీనివాస్, దరిపెల్లి రమేశ్, మడమకల రాజిరెడ్డి, వామసాని వేణు, గణకులు పెండ్యాల గురువయ్య ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం



స్కూల్ ఆవరణ శుభ్రం చేస్తున్న వలంటీర్లు

ఇల్లందకుంట: మండలంలోని బూజునూర్, సీతంపేట గ్రామాల్లో జమ్మికుంట పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కొనసాగుతోంది. సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు బూజునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలోని పిచ్చిమొక్కలు, వ్యర్థాలను, రోడ్డుకిరువైపుల ముళ్లపొదలను తొలగించారు. హరితహారంలో నాటిన మొక్కలకి నీరు పోశారు. కార్యక్రమంలో బూజునూర్ సర్పంచ్ సరిగొమ్ముల అరుణ సదానందం, సీతంపేట సర్పంచ్ వెంకటస్వామి, హెచ్‌ఎం పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. చిరంజీవి, డైరెక్టర్ శివ, ప్రోగ్రాం అధికారులు సాయికృష్ణ, వంశీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యులరైజ్ చేయాలి

గన్నేరువరం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా కోశాధికారి హన్మండ్ల యాదగిరి కోరారు. గుండ్లపల్లిలో మాట్లాడుతూ ఇదే శాఖలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసిన విధంగా చేయాలన్నారు. సమ్మెకు వెళ్లిన కారణంగా రెండేళ్లుగా వేతనంతో పాటు 33 శాతం పీఆర్సీని కోల్పోయామని, చాలీచాలని వేతనంతో ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలకు పూటగడవని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న వారందరికి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గుంతలరోడ్డుతో తంటాలు

- అధ్వానంగా తయారైన ధర్మారం–కాచాపూర్ రోడ్డు
- మరమ్మతుకు రూ.1.94 కోట్లు
- ప్రారంభంకాని పనులు



గుంతలమయంగా కాచాపూర్ రోడ్డు

శంకరపట్నం: మండలంలోని ధర్మారం, రాజాపూర్– కాచాపూర్ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాజాపూర్, కాచాపూర్, గద్దపాక గ్రామాలతో పాటు వీణవంక మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు గుండా శంకరపట్నం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజాపూర్, కాచాపూర్, గద్దపాకతో పాటు వీణవంక మండలం ఘన్ముక్కులకు నిత్యం వెళ్తోంది. వీణవంక మండలం చల్లూర్ మానేరు వాగు నుంచి శంకరపట్నం మండలంతోపాటు హుజూరాబాద్, సైదాపూర్ మండలాలకు ఇసుక తరలిస్తున్నారు. ట్రాక్టర్, ఆటోలు, ద్విచక్రవాహనాలతో నిత్యం రోడ్డు రద్దీగా ఉంటుంది. ఇసుక ట్రాక్టర్లతో రోడ్డంతా గుంతలమయంగా తయారైంది. దీంతో ఆటోలు, ఇతర వాహనాలు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

నిధులు మంజూరు

ఏడు కిలోమీటర్ల రోడ్డు మరమ్మతు కోసం ఆర్‌అండ్‌బీశాఖ రూ.1.94 కోట్లు నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ సైతం పూర్తి అయినట్లు సమాచారం. పనులు త్వరగా చేపడితే నిత్యం గుంతల రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులు తీరనున్నాయి.



రాజాపూర్‌లో మూలమలుపువద్ద..

మరమ్మతు చేయాలి



కాచాపూర్ నుంచి ధర్మారం వరకు రోడ్డు మరమ్మతు చేయాలి. గుంతల రోడ్డుపై కారులో ప్రయాణించడంతో తరుచూ రిపేర్‌కు గురవుతోంది. అధికారులు స్పందించి త్వరగా పనులు చేపట్టాలి.

– నాంపల్లి తిరుపతి, కాచాపూర్

ఇబ్బందులు పడుతున్నాం



రాజాపూర్ మూలమలుపు వద్ద గుంతల్లో వర్షం నీరు నిలుస్తోంది. బీటీరోడ్డు వేసి ప్రయాణికుల కష్టాలు తీర్చాలి. రాజాపూర్–కాచాపూర్ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ఇబ్బందులు పడుతున్నాం.

– రాజిరెడ్డి , రాజాపూర్

పనులు చేపడతాం

రోడ్డు మరమ్మతుకు నిధు లు మంజూరయ్యాయి. ధర్మారం నుంచి కాచాపూర్ వరకు ఏడు కిలోమీటర్ల మేర రోడ్డు పనులకు టెండర్ నిర్వహించాం. ఏప్రిల్‌లో రోడ్డు మరమ్మతు పనులు చేపడతాం.

– బాపురెడ్డి, డీఈ, ఆర్‌అండ్‌బీశాఖ

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



మాట్లాడుతున్న ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి



రామడుగు: భగవాన్‌ను అభినందిస్తున్న సీపీ

- హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి
- పెట్రోకార్ డ్రైవర్‌ను అభినందించిన సీపీ సుబ్బారాయుడు

జమ్మికుంట: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వినాయక గార్డెన్‌లో టౌన్ సీఐ రామచందర్‌రావు ఆధ్వర్యంలో మద్యం సేవించి వాహనాలు నడిపినవారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడపొద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎదుటి వారికి సైతం ప్రమాదం జరుగుతుందని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోన్ యాప్‌లు డౌన్లోడ్ చేసుకునే క్రమంలో సైబర్ క్రైమ్ బారిన పడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని, అనవసర లింక్‌లు క్లిక్ చేయకూడదని, సైబర్ నేరగాళ్లు డబ్బులు దొంగిలించే పని చేస్తున్నారని, సైబర్ క్రైమ్ జరిగితే 1930 నెంబర్‌కు డయల్ చేయాలన్నారు. నేరాల నియంత్రణకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ యూనిస్‌అహ్మద్‌అలీ, హుజూరాబాద్ టౌన్ ఎస్‌ఐ రాజన్న పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని పోలీస్ స్టేషన్‌లో పెట్రో కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్న భగవాన్ ఈ నెల 18న హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్యతో కలిసి వెదిర ఎక్స్‌రోడ్డులో విధులు నిర్వహిస్తున్నాడు. కరీంనగర్‌కు చెందిన కట్ట కిరణ్‌కుమార్ ఎక్స్‌రోడ్డు వద్ద గుండెపోటుతో వాహనం పైనుంచి కింద పడ్డాడు. భగవాన్ సకాలంలో సీపీఆర్ చేయడంతో కిరణ్ స్పృహలోకి వచ్చాడు. వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడాడు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో రివార్డు, శాలువాతో సీపీ సుబ్బారాయుడు, ఏసీపీ కరుణాకర్‌రావు భగవాన్‌ను అభినందించారు.

రూ.51,016 విరాళం



విరాళం అందజేస్తున్న జయపాల్‌రెడ్డి

గంగాధర: మండలంలోని మధురానగర్ గ్రామంలో గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మైత్రి గ్రూప్స్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి రూ.51,016 విరాళం అందజేశారు. సోమవారం సంఘం నాయకులు జయపాల్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా ఆర్థికసాయం చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



చెల్పూర్‌లో చెక్కులు అందిస్తున్న కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని 41 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలవలేదని, సీఎం కేసీఆర్ ఆడబిడ్డల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం చేపట్టారని, ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం అమలు చేయడం లేదన్నారు. సంక్షేమ పథకాలను కేంద్రం దండగా పథకాలంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ ఇరుమల్ల రాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్మన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంటీసీలు, తహసీల్దార్ కోమల్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి, తదితరులు

మానకొండూర్: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని, ప్రభుత్వం గడపగడపకూ అందిస్తున్న సంక్షేమ పథకాలే ఇందుకు నిదర్శనమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ బసవరాజు సారయ్య అన్నారు. మానకొండూర్‌లో సోమవారం పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణపై నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధుల, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలను ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కష్టపడే కార్యకర్తలకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని, సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ వరకు మానకొండూర్ నియోజకవర్గంలో నిర్వహించే పార్టీ ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్



రాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రామడుగు: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలు, మామిడి తోటలను పరిశీలించారు. అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందిస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, సర్పంచ్ శేఖర్ తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



గంగాధర: క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

హుజూరాబాద్‌రూరల్: దళితులను కూలీల నుంచి యజమానులుగా చేశారని నియోజకవర్గంలోని దళితులు సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గంలో దళితబంధు పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించి దళితులు ఉన్నత స్థాయికి రావాలని ఆలోచించిన తీరు గొప్ప దని కొనియాడారు. ప్రతి కుటుంబానికి పథకం అందజేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. దళితబంధు రానివారికి వచ్చేలా చేయాలని కోరారు. ఇటీవల ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఇంటికి బాధితులు అడుగుదామని వెళ్తే గిట్టనివారు ముట్టడి అని వక్రీకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, శివ, విజయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

గంగాధర: సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఉద్యోగులు సోమవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కలిసి సన్మానించారు. అనంతరం బూర్గుపల్లి చౌరస్తాలో క్షీరాషేకం కార్యక్రమం నిర్వహించారు.

పంట నష్టంపై నిర్లక్ష్యం తగదు



హుజూరాబాద్‌రూరల్: మాట్లాతున్న సొల్లు బాబు

చొప్పదండి: రైతులకు జరిగిన పంట నష్టంపై అంచనా వేయడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గుమ్లాపూర్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఫసల్ బీమా యోజన అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, రైతులకు నష్ట పరిహారం అందడం లేదని, ఎకరాకు లక్ష రూపాయల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వెంట బత్తుల లక్ష్మీనారాయణ, అన్నాడి రాజిరెడ్డి, మావురం సుదర్శన్‌రెడ్డి, తోట కోటేశ్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో నష్టపరిహారం అందించాలి

హుజూరాబాద్‌రూరల్: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలపై సర్వే చేయించి రైతులకు సకాలంలో నష్టపరిహారం అందించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. డివిజన్ వ్యాప్తంగా వానలకు వరి, మొక్కజొన్న తదితర పంటలు, అరటి, మామిడి తోటలకు నష్టం బాగా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రఘుపతి,వేల్పుల భాస్కర్,ఎం.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ధర్నా

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సర్వే నంబర్ 669లోని ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అక్రమ పట్టాదారులను తొలగించాలని, అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు చేపట్టాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జెడ్పీ సీఈవో ఈ భూములపై విచారణ చేసి నెలరోజులవుతున్నప్పటికీ ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు నివేదికను బహిర్గతం చేసి భూములను స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. సంఘం అధ్యక్షుడు కె. అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి దేవకిషన్, గోపాలభూషణరావు, చంటి శ్రీనివాస్, విజయ్‌కుమార్, ఎండీ పాషా, దాన కిశోర్, గడప కాంతమ్మ, సంతోష్, శేఖర్ పాల్గొన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన ఎన్‌టీఎస్‌ఎఫ్

శాతవాహనయూనివర్సిటీ: బయోమెట్రిక్ హాజరును అందరికీ అమలు చేయకుండా కేవలం డిప్లొమా విద్యార్థులకే అమలు చేస్తుండటంపై హైకోర్టును ఆశ్రయించినట్లు ఎన్‌టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర సంజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బయోమెట్రిక్ విధానం బీటెక్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసి విద్యార్థులకు ప్రారంభించలేదన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థులకు అమలు చేయాలని కోరారు. బయోమెట్రిక్ లేకపోవడంతో విద్యార్థులు చదువులో వెనక పడుతున్నారని, కొన్ని కళాశాలలు కేవలం అక్రమంగా రియంబర్స్‌మెంట్ కొల్లగొట్టడానికి మాత్రమే కళాశాలలు నడుపుతున్నారని ఆరోపించారు. బయోమెట్రిక్ పెడితే అక్రమాలకు అడ్డు కట్టపడుతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బయోమెట్రిక్ అమలు చేయాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, రాకేశ్, ప్రశాంత్, సందీప్ పాల్గొన్నారు.

హమాలీల కూలి పెంచాలి

హుజూరాబాద్‌రూరల్: పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా యజమానులు హమాలీల కూలి వెంటనే పెంచాలని ఏఐటీయూసీ డివిజన్ నాయకులు అనిశెట్టి చంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కూలి పెంచాలని కోరుతూ హమాలీలతో కలిసి ధర్నా చేపట్టారు. గతంలో చేసుకున్న ఒప్పందం జనవరిలోనే ముగిసిందని, ఇప్పటివరకు హమాలీల కూలి పెంచలేదని పెంచినట్లు అంగికరించే వరకు నిరసన తెలుపుతామని హెచ్చరించారు. నిరసనలో పట్టణ హమాలీ సంఘం అధ్యక్షుడు ఎస్ పోచయ్య, కార్యదర్శి రాంమూర్తి, కుమారస్వామి, ఆనందం, ప్రభాకర్, మిసరకండ్ల రవి, లంకదాసరి విజేందర్, కనకం సురేష్, పోలు ప్రేమ్, కటుకోజు సురేష్, మనుగొండ శంకర్, ఎనుగందుల వెంకటేశ్వర్లు, సంపత్, మిడిదొడ్డి స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈదురుగాలులు, వర్షాలకు దెబ్బతిన్న పంటలపై సర్వే చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ చిగురుమామిడి మండల రైతు సంఘం కన్వీనర్ కాంతాల శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం చిగురుమామిడిలో మాట్లాడారు. పంటలు, తోటలు చేతికందే సమయంలో తీవ్ర నష్టం వాటిల్లిందని, వ్యవసాయశాఖ అధికారులు పర్యటించి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జరిగిన నష్టానికి తగిన పరిహారం అందించాలన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



గన్నేరువరంలో నిరసన దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

గన్నేరువరం: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకుపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని గుండ్లపల్లిలో పార్టీ శ్రేణులు నిరసన దీక్ష చేపట్టారు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని మండిపడ్డారు. గతంలో ఇంటర్ బోర్డు పరీక్షల్లో జరిగిన తప్పులకు 30 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొలిపాక రాజు, సొల్లు అజయ్‌వర్మ, జిల్లా అధికార ప్రతినిధులు సమ్మిరెడ్డి, కళ్యాణ్‌చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు సంపత్, శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణాచారి, కార్యదర్శి లక్ష్మన్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి నికేష్, మహేందర్, మల్లేశం, మల్లేశం, ప్రవీణ్, అనిల్, అశోక్, అంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, శ్రీనివాస్, రవి, సత్యం, వెంకన్న, అర్జున్, రాజు, రాజశేఖర్, రాజ్‌కుమార్, శ్రీహరి, సారయ్య పాల్గొన్నారు.

ఏప్రిల్ 6న వీరహనుమాన్ విజయయాత్ర

విద్యానగర్(కరీంనగర్): హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్ విశ్వ హిందూపరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న కరీంనగర్‌లో వీరహనుమాన్ విజయయాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్ తెలిపారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో విజయయాత్రకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. విజయయాత్రలో శ్రీగిరి శేషాద్రినాథ్ మఠ పీఠాధీశ్వరులు సర్వేశ్వరాంబికా శివాచార్య స్వామిజీ పాల్గొంటారని అన్నారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు తోట రాజేందర్, తరాజు నవనీత్‌రావు, కొమ్ము ఆంజనేయులు, ఎలిమెల సతీశ్, బజరంగ్‌దళ్ నాయకులు తోట ప్రదీప్‌కుమార్, వుట్కూరి రాధాకృష్ణరెడ్డి, గజ్జెంట రాజేందర్, వంగర ఆంజనేయులు, బూస అశోక్, శివ, మురళీ, అఖిల్, సంతోష్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు,

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

హుజూరాబాద్‌రూరల్: పిల్లలు ఉత్తమ లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని ఎంఈవో కేవీ నరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని న్యూ శాతవాహన హైస్కూల్‌లో ఫేర్వెల్ పార్టీలో మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలకు కష్టం, సుఖం విలువ తెలియజేయాలని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తట్టుకునే శక్తి వస్తుందన్నారు. అనంతరం ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోరం సంజీవరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వాకులాభరణం వెంకటేశ్వర్లు, పరాంకుశం కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు సంపత్‌కుమార్, స్వరూపరాణి, షాహిన్ కుమారి, రాజేశ్, రాజయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

మందుబాబులకు అడ్డాగా పాఠశాల

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో కొంతమంది సెలవు దినాల్లో మద్యం సేవిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని ఎస్‌ఎంసీ చైర్మన్ గడ్డం సుమిత్‌రెడ్డి తెలిపారు. మద్యం సేవించి అక్కడే బాటిళ్లను పగలగొడుతున్నారని, దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పోలీసులకు వివరించారు.

